ఎంఎంసి చైర్మన్‌గా మణిచంద్ర ప్రకాష్

ప్రజాశక్తి- కవిటి

ఇచ్ఛాపురం ఎఎంసి చైర్మన్‌గా కవిటి మండలం టిడిపి మండల అధ్యక్షుడు, జాడుపూడి ఆర్ఎస్‌కు చెందిన బి.మణిచంద్ర ప్రకాష్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాత్రి ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన అధిష్టానికి, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విప్‌తో మణిచంద్ర ప్రకాష్

ఒపి ధర... గుండె దడ

- ఇష్టానుసారంగా పెంచుకుపోతున్న టోకెన్ ధరలు
- ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ.500 నుంచి రూ.600 వరకు ఫీజు
- పలు రకాల పరీక్షల పేరుతో అధిక రుసుముల వసూలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

ప్రైవేటు ఆసుపత్రుల్లో ఒపి ధరలను యేటికేడు పెంచేస్తున్నారు. ప్రజల్లో తమకున్న డిమాండ్‌ను అవకాశంగా తీసుకుని ప్రైవేటు యాజమాన్యాలు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నాయి. ఒపి ధర వింటేనే గుండె దడ పుట్టేలా కొన్నిచోట్ల ఫీజులు ఉన్నాయి. శ్రీకాకుళం నగరంలోని ఇలిసిపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఏకంగా రూ.650 వసూలు చేస్తున్నారంటే, వారి దందా ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక రోగి డాక్టర్‌ను కలిసిన తర్వాత జేబులు ఖాళీ అవ్వాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. చాలా ఆస్పత్రుల్లో అవసరం ఉన్నా, లేకున్నా రకరకాల పరీక్షలకు సిఫార్సు చేసి అధిక మొత్తంలో డబ్బులు గుంజుతున్నారు.

ఒక ఆసుపత్రిలో వేచి చూస్తున్న రోగులు, కుటుంబసభ్యులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, అరసవల్లి

జిల్లాలో సుమారు 180 ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. జిల్లా కేంద్రంలోనే వందకు పైగా ఆసుపత్రులు ఉన్నాయి. వైద్య పర్యవేక్షణ బాగుంటుందనో, అన్ని సౌకర్యాలు ఉంటాయనో వంటి కారణాలతో ఎక్కువ మంది రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో వాటికి గిరాకీ పెరుగుతోంది. మంచి పేరున్న ఆసుపత్రులైతే వేరే చెప్పనక్కర్లేదు. ఆ నోటా ఈ నోటా ఆ ఆసుపత్రిలో బాగుంటుందని తెలియడంతో రోగులు, వారి బంధువులు అంతా అక్కడకే పరుగులు తీస్తున్నారు. తమ వారి ప్రాణాలను కాపాడుకోవాలనే ఆందోళనతో అప్పులు చేసి ఎంత డబ్బులైనా వెచ్చించేందుకు సిద్ధమవుతున్నారు. ఇదే అదునుగా కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు ఇష్టానుసారంగా ఒపి రేట్లను పెంచేస్తున్నాయి. ఒకప్పుడు రూ.200 మాత్రమే ఉండే ఒపి ధర ఇప్పుడు ఎక్కువ ఆస్పత్రుల్లో రూ.400 నుంచి రూ.600 వరకు వసూలు చేస్తున్నాయి. శ్రీకాకుళం నగరం ఇల్లీసుపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో రూ.600 వసూలు చేస్తున్నారు. ఒపి ఫైల్ కోసం అదనంగా మరో రూ.50 వసూలు చేస్తున్నారు. డే అండ్ నైట్ కూడలిలోని దాదాపు అన్ని ఆస్పత్రులు రూ.400 పైబడి వసూలు చేస్తున్నాయి. కార్పొరేట్ ఆసుపత్రులన్నింటిలోనూ రూ.500 ఉన్నాయి.

ఒక్కసారికే టోకెన్ చెల్లుబాటు

ఒపి ధరల అమల్లో వైద్యారోగ్యశాఖ పర్యవేక్షణ కొరవడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఒపి టోకెన్ ధర కాలపరిమితి 15 రోజుల వరకు ఉండేది. మందులు అప్పటివరకు రాసి వాడమనేవారు. 15 రోజుల్లో రెండోసారి వెళ్లినా ఒపి వసూలు చేసే వారు కాదు. ఇప్పుడు వారం రోజుల కాలపరిమితికి మాత్రమే టోకెన్ అందిస్తున్నారు. పది రోజులకు తగ్గట్టు మందులు అందించి వాటిని వాడిన తర్వాత మళ్లీ రావాలని సూచిస్తున్నారు. దీంతో ఆ టోకెన్ చెల్లుబాటు కావడం లేదు. మళ్లీ డబ్బులు కట్టి టోకెన్ పొందాల్సి వస్తోంది.



Doctor's Fees Particulars

Fracture fees	
➢ Below Elbow Plaster fees	3600/-
➢ Above Elbow Plaster fees	4100/-
➢ Below Knee Plaster fees	4100/-
➢ Above Knee Plaster fees	4600/-
Dislocation Corrections	
➢ Shoulder Dislocation Correction	2000/-
➢ Elbow Dislocation Correction (M/R + A/E POP Slab)	3600/-
➢ Ankle/Knee Dislocation Correction	3600/-
➢ Intra Articular Injections	550/-

జిల్లా కేంద్రంలోని ఓ ఆసుపత్రిలో ధరల పట్టిక

అనుబంధంగా ల్యాబ్‌లు, మందుల షాపులు

ప్రైవేటు ఆసుపత్రులకు అనుబంధంగా ల్యాబ్‌లు, మందులు షాపులు నడుపుతున్నారు. బయట ల్యాబ్‌ల్లో వైద్య పరీక్షలకు తక్కువ ధర ఉంటే, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఎక్కువ ధరలు వసూలు చేస్తున్నారు. వైద్యుడు సూచించడంతో తప్పనిసరిగా అక్కడే చేయించుకుంటూ అధిక ధరలను చెల్లిస్తున్నారు. అదీ అవసరమున్నా, లేకున్నా అన్ని పరీక్షలు చేయిస్తున్నారంటూ రోగులు వాపోతున్నారు. ఆసుపత్రుల ప్రాంగణంలోనే మందుల దుకాణాలను నడుపుతున్నారు. బయట దుకాణాల్లో కనీసం పది శాతం డిస్కౌంట్ ఇస్తుండగా, ఇక్కడ రూపాయి కూడా తగ్గించడం లేదు. తమ వద్ద డబ్బులు లేవని ఐదేసి చొప్పున మాత్రలు ఇవ్వాలని రోగులు బతిమిలాడుకున్నా, స్ట్రిప్ తీసుకోవాల్సిందేనని బదులిస్తున్న పరిస్థితి చాలా ఆస్పత్రుల్లో నెలకొంది.

ఆసుపత్రిలో చేరితే అప్పులపాలే...

ఒపి ధరలు ఇలా ఉంటే, ఆసుపత్రిలో అడ్మిట్ అయిన వారి పరిస్థితి మరీ దారుణంగా ఉంది. రోగుల నుంచి రకరకాల పేర్లతో అడ్డగోలుగా డబ్బులను వసూలు చేస్తున్నాయి. ఆసుపత్రిలో చేరిన రోగి కోలుకునే వరకు అతని బాధ్యతను సంబంధిత వైద్యుడే చూసుకోవాల్సి ఉండగా, రౌండ్ల పేరుతో రూ.500 వసూలు చేస్తున్నారు. ఇవి కాకుండా డ్యూటీ డాక్టర్ ఫీజు అని, నర్సింగ్ ఛార్జీలు ఇలా రకరకాల పేర్లతో డబ్బులను గుంజుతున్నారు. ఐసియులో చేరిన రోగి బంధువుల పరిస్థితి అయితే వేరే చెప్పనక్కర్లేదు. ఒక్కో ఆసుపత్రిలో ఐసియు ఛార్జీలను రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారు. 24 గంటలకోసారి రోగి బంధువులతో అడ్వాన్స్‌గా డబ్బులు కట్టించుకుని, ఆ తర్వాత చాంతాడులా ఫీజుల జాబితాను రోగి బంధువుల చేతిలో పెడుతున్నారు. రోగికి ఐసియు వార్డులో ఉంచాల్సిన అవసరం లేకున్నా, కొన్ని ఆసుపత్రులు అధిక సొమ్ముల కోసం అదనపు రోజులు అందులోనే ఉంచుతున్న పరిస్థితి నెలకొంది.

ఒపి ధరలపై దృష్టిసారిస్తాం

ప్రైవేటు ఆసుపత్రులపై ప్రత్యేక దృష్టిసారిస్తాం. ముఖ్యంగా యాజమాన్యాలు వసూలు చేస్తున్న ఒపి, ఇతర ధరలను పరిశీలిస్తాం. ధరల నియంత్రణకు చర్యలు చేపడతాం. పలురకాల సేవలకు సంబంధించిన రేట్ల పట్టికను ఆసుపత్రుల్లో కచ్చితంగా ప్రదర్శించాలి. లేకుంటే చర్యలు తప్పవు.

- డాక్టర్ కె.అనిత, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి

మాట్లాడుతున్న మాజీ ఎంపీ మిడియం బాబూరావు

ఐదో షెడ్యూల్‌కు నోచుకోక...

గిరిజనులకు తీవ్ర నష్టం

- జిల్లాలో ఒక్క గ్రామమూ లేకపోవడం విచారకరం
- నాన్ షెడ్యూల్ గిరిజనులకు తీవ్ర వివక్ష
- మాజీ ఎంపీ మిడియం బాబూరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో శతశాతం గిరిజనులున్న గ్రామాలు సైతం ఐదో షెడ్యూల్‌కు నోచుకోకపోవడంతో ఆదివాసీలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ కో చైర్మన్, మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబూరావు అన్నారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఐటిడిఎ కేంద్రంగా సీతంపేట మండలంలో 16 పంచాయతీలే ఐదో షెడ్యూల్‌లో ఉన్నాయన్నారు. ఐటిడిఎ పరిధిలోని ఆరు మండలాల పరిధిలోని 450 గ్రామాల్లో పూర్తిగా గిరిజనులే నివాసముంటున్నా, ఐదో షెడ్యూల్‌లో చేర్చడం లేదని విమర్శించారు. జిల్లాల విభజన తర్వాత సీతంపేట ఐటిడిఎ, పార్వతీపురం మన్యం జిల్లాలోకి వెళ్లిపోవడంతో శ్రీకాకుళం జిల్లాలో ఒక్క గ్రామమూ ఐదో షెడ్యూల్‌లో లేకపోవడం విచారకరమన్నారు. ఐదో షెడ్యూల్‌లో గ్రామాలు లేకపోవడంతో 1/70, పీసా వంటి చట్టాలు అమలు కావడం లేదన్నారు. నాన్ షెడ్యూల్ గ్రామాల్లో ఉన్న గిరిజనులకు తహశీల్దార్లు ధ్రువపత్రాలు ఇవ్వడం లేదని చెప్పారు. ఉద్యోగాలు, రిజర్వేషన్లు వంటి అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాన్ షెడ్యూల్‌లో ఉన్న గిరిజన గ్రామాలు తీవ్ర వివక్షకు గురవుతున్నాయన్నారు. ఆదివాసీల భూముల రక్షణ, సంక్షేమం కోసం తక్షణమే రాష్ట్ర గిరిజన సలహా మండలి ఏర్పాటు చేసి, రాష్ట్రంలో ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

జిల్లాలో 20 రకాల అటవీ ఉత్పత్తులను గిరిజనులు సేకరిస్తున్నా, జిసిసి వాటిని కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడం వల్ల అవి నిర్వీర్యమైపోయాయన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా, అటవీ ఉత్పత్తులను గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేయడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఐదో షెడ్యూల్‌లో లేని గిరిజన గ్రామాల్లో పవర్ ప్లాంట్లు, ప్రాజెక్టులు, గనుల తవ్వకం వంటివి చేపట్టడానికి వీల్లేదన్నారు. గిరిజనులు నివసిస్తున్న బూర్జ-సరుబుజ్జిలి ప్రాంతంలో థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధమవుతోందంటూ విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. గ్రామాలు ఐదో షెడ్యూల్‌లో లేకపోయినా, ఆరో షెడ్యూల్‌లోని నిబంధనల ప్రకారం గ్రామసభ ఆమోదం లేకుండా ఏర్పాటు చేయడానికి సాధ్యపడదన్నారు. పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయదలిస్తే గిరిజనుల జీవితంపై పడే ప్రభావం, పర్యావరణ మదింపు నివేదికలతో గిరిజనులకు ఏవిధంగా ప్రయోజనకరమో లేక వారికి ఉద్యోగాలేమైనా ఇస్తారా అనే అంశాలను చట్టం ప్రకారం అమలు చేయాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం టూరిజం అభివృద్ధి పేరుతో ఏజెన్సీ ప్రాంతాల్లో సహజ వనరులు ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టే విధానాలను విరమించుకోవాలని హితవు పలికారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అపారమైన సహజ వనరులు ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేయడానికే ప్రభుత్వం ఐటిడిఎ ద్వారా వర్క్ షాపులను నిర్వహిస్తోందని చెప్పారు. సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గొంతు అప్పారావు, ఎన్.అప్పన్న, జిల్లా ఉపాధ్యక్షులు సవర పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సిటిఆర్‌ను కలిసిన బాబూరావు

సిపిఎం సీనియర్ నాయకులు చౌదరి తేజేశ్వరరావును ఆయన నివాసంలో బాబూరావు కలిసి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు తదితరులున్నారు.

ఆలివ్‌రిడ్లే తాబేళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

19, 20న బీచ్ ఫెస్టివల్

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - సోంపేట

ఈనెల 19, 20 తేదీల్లో బారువలో బీచ్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి మండలంలోని బారువ హరిత బీచ్ రిసార్ట్‌లో బీచ్ ఫెస్టివల్ నిర్వహణ ఏర్పాట్లపై బుధవారం సమీక్షించారు. ముందుగా సంబంధిత అధికారులతో కలిసి బీచ్ పరిసరాలు పరిశీలించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై జిల్లా పర్యాటక శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం హరిత బీచ్ రిసార్ట్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడుతూ 19వ తేదీన ప్రారంభం కానున్న బీచ్ ఫెస్టివల్‌కు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొంటారని తెలిపారు. ఆ రోజు ఉదయం 5.30 గంటలకు తాబేళ్లను సముద్రంలోకి విడిచిపెట్టి కార్యక్రమం ప్రారంభిస్తారని చెప్పారు. బీచ్ ఫెస్టివల్‌తో పాటు స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీచ్ క్లినింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సోంపేట మండలం పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి చెందిందన్నారు. ఎత్తయిన ఇసుక దిబ్బలు ఎటు చూసినా పచ్చదనంతో ఆహ్లాదంగా కనిపించే కొబ్బరి తోటలు ఆధ్యాత్మికతను నింపే ప్రాముఖ్యత కలిగిన పురాతన ఆలయాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే లైట్ హౌస్, రిసార్ట్స్ నిలుస్తాయన్నారు. బీచ్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించాలని ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు రాకుండా కార్యక్రమాన్ని విజయవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో నిర్వహించే క్రీడలపై ప్రజల్లో ఆసక్తిని పెంపొందించేలా ప్రణాళికాబద్ధంగా రూపొందించాలని సూచించారు. దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ముందుగానే రోజుకొక కార్యక్రమాన్ని చేపట్టి పెద్దఎత్తున ప్రచారం చేయాలన్నారు. దానికి సంబంధించి డిజిటల్, సోషల్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలను వినియోగించుకోవాలని సూచించారు. ఫెస్టివల్‌కు ప్రముఖులను ఆహ్వానించాలని తహశీల్దార్ అప్పలస్వామికి సూచించారు. కాశీబుగ్గ డిఎస్‌పి ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని, జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యాన పారిశుధ్య నిర్వహణ చేపట్టాలన్నారు. మత్స్యశాఖ అధికారి లైఫ్ గార్డు బోట్లు ఏర్పాటు చేయాలన్నారు. పర్యాటక శాఖ అధికారి, డిఎస్‌ఒ, వైద్య, మెరైన్, అగ్నిమాపక, ఆర్అండ్‌బి, అటవీ, నీటిపారుదల, విద్యుత్ శాఖ అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పర్యాటక అభివృద్ధికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకుని జిల్లాకు పర్యాటకంగా మంచి పేరు వచ్చేలా కార్యక్రమాలు ఉండాలన్నారు. అనంతరం పాత దిబ్బలపాలెం సముద్ర తాబేలు సంరక్షణ కేంద్రం నుంచి 205 సముద్ర తాబేలు పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టారు. కార్యక్రమంలో పలాస ఆర్‌డిఒ వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బి ఎస్ఇ జాన్ సుధాకర్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అనిత, మత్స్య శాఖ ఉప సంచాలకులు సత్యనారాయణ, డిఎస్‌డిఒ శ్రీధర్, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, అటవీశాఖ అధికారి నాయుడు, వెంకటేష్, హరిత బీచ్ రిసార్ట్స్ ఎమ్‌డి విశ్వనాథ్, మేనేజర్ సందీప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను నియంత్రించాలి

మాట్లాడుతున్న టౌన్ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ నాయుడు

ఆమదాలవలస: మున్సిపాల్టీలో అక్రమ కట్టడాలను నియంత్రించి, గృహ నిర్మాణ ప్లాన్ అనుమతులు పొందిన తర్వాతనే భవన నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ పి.నాయుడు టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. పురపాలక సంఘం కార్యాలయంలో కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ అధ్యక్షతన వార్డు ప్లానింగ్ సెక్రటరీలతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లే అవుట్ రెగ్యులరైజేషన్ కింద దరఖాస్తు చేసుకుని పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేటికీ వసూళ్లు కాకుండా పెండింగ్‌లో ఉన్న ఆక్రమణ ఫీజుల బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలన్నారు. సిబ్బంది విధులపై నిర్లక్ష్యం వహిస్తే సచివాలయ వార్డు ప్లానింగ్ సెక్రటరీలపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో డిటిసిపిఒ ఎం.కృష్ణారావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఎస్.వరప్రసాదరావు, సచివాలయ వార్డు ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

బేవరేజ్ హమాలీల ఉపాధిని కాపాడాలి

డిఆర్‌ఒకు సిఐటియు వినతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎపి బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యాన ఎచ్చెర్ల మద్యం డిపోలో పనిచేస్తున్న హమాలీల ఉపాధిని కాపాడాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎపిబిసిఎల్ హమాలీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.బంగార్రాజు ప్రభుత్వాన్ని కోరారు. కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎచ్చెర్ల మండల కేంద్రంలో వంద మంది దళిత కుటుంబాలకు చెందిన నాలుగెకరాల భూములను 1986లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుని యారక్ బాటిలింగ్ యూనిట్ ఏర్పాటు చేసి, సారా తయారీ కేంద్రంలో దళితులను కార్మికులుగా, హమాలీలుగా ఉపాధి కల్పించారని చెప్పారు. ఇప్పుడు ఎపి బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్, ఐఎంఎల్ డిపోగా మారుస్తూ నిర్వహిస్తున్న డిపోలో 80 మంది హమాలీలుగా లోడింగ్, అన్ లోడింగ్ పనులు పనిచేస్తూ రోజువారీ వచ్చే ఆదాయంతో కుటుంబాలను పోషిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం 220 మద్యం షాపులకు ఎచ్చెర్ల డిపో నుంచి మద్యం సరఫరా చేస్తున్నారని చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లాలో డిపో లేకపోవడంతో ఇక్కడ్నుంచే 40 షాపులకు మద్యం సరఫరా చేస్తున్నారని తెలిపారు. భవిష్యత్‌లో మన్యం జిల్లాకు చెందిన 40 షాపులు తగ్గిపోతాయన్నారు. జిల్లాలో ఉన్న మద్యం దుకాణాలకు ప్రభుత్వం సొంత గోడౌన్లలో నిల్వలు ఉంచి మద్యం సరఫరా చేస్తుంటే, అదనంగా టెక్కలిలో మరో ప్రైవేట్ గోడౌన్ అద్దెకు తీసుకొని ప్రారంభించేందుకు ప్రతిపాదన చేస్తున్నారని చెప్పారు. దీనివల్ల గోడౌన్‌కు అద్దె భారంతో పాటు అదనపు సిబ్బందిని ప్రభుత్వం నియమించాల్సి ఉంటుందన్నారు. ఎచ్చెర్ల డిపోపై ఆధారపడి జీవిస్తున్న 80 దళిత, పేద కుటుంబాలకు చెందిన హమాలీలకు తగినంత ఆదాయం రాక కార్మికుల కుటుంబాలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని ఎపిబిసిఎల్ ఆధ్వర్యాన టెక్కలిలో అదనపు డిపో ప్రతిపాదనను విరమించుకోవాలని కోరారు. హమాలీల ఉపాధిని కాపాడాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ నాయకులు ఎన్.రమణ, ఎస్.నరేంద్రకుమార్, ఎన్.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ఇకపై ఆన్‌లైన్‌లో ఎపిజిఎల్ఐ ఫైళ్లు

శ్రీకాకుళం: ప్రభుత్వ ఉద్యోగుల గ్రూప్ ఇన్సూరెన్స్ (ఎపిజిఎల్ఐ)కి సంబంధించి పాత ఫైళ్లను ఇకపై ఆన్‌లైన్‌లోనే పంపించాలని జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఎస్.వి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మే 2024 నుంచి https://nidhi.apcfss.in వెబ్‌సైట్‌లోని నిధి పోర్టల్ ద్వారా మాత్రమే ఫైళ్లను అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. జీవిత బీమా ఫైళ్ల వివరాలు, పాత బీమా ప్రీమియం, వాలంటరీ ప్రీమియం పెంపు వంటి డేటాను ఉద్యోగులు తమ యూజర్ లాగిన్ ద్వారా నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి సంబంధిత డిడిఒకు పంపించాలని తెలిపారు. డిడిఒలు తమ యూజర్ ఐడి ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేసి, ఎన్హాన్స్‌మెంట్ టైటిల్‌ను జెనరేట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎపిజిఎల్ఐకి సంబంధించిన అన్ని ప్రక్రియలు ఇకపై పూర్తిగా ఆన్‌లైన్‌లోనే చేయాలని స్పష్టం చేశారు.

కూటమి మోసపూరిత హామీలు

ప్రజలకు తెలియజేయాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

తెలుగుదేశం పార్టీతో జతకట్టిన కూటమి పార్టీ నాయకులు ఎన్నికల్లో అమలు కాని మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చారని వైసిపి జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ దుయ్యబట్టారు. మండలంలోని తమ్మినాయుడుపేటలో బుధవారం వైసిపి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో టిడిపి రెడ్‌బుక్ రాజ్యాంగం నడిపించి వైసిపి నాయకులను, కార్యకర్తలను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్-సిక్స్ హామీలైన మహిళలకు ఉచిత బస్సు, తల్లికి వందనం, ఆడబిడ్డలకు నెలకు రూ.1500 వంటివి ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. కూటమి నాయకుల్లో ఒకరికి ఒకరు పొంతన లేదని, రోజుకో రకంగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాజధాని నిర్మాణం, పోలవరం పూర్తి, స్టీల్ ప్లాంట్ విషయాల్లో రోజుకో విధంగా పొంతన లేని మాటలు చెబుతున్నారని పేర్కొన్నారు. పార్టీ పటిష్టం కోసం ప్రతి కార్యకర్తా ప్రజల వద్దకు వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను వివరించాలన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ మెప్పుకోసం ఎపి ప్రభుత్వం కూటమి భజన చేస్తుందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అధికారులు అవలంబిస్తున్న తీరుచాలా బాధిస్తుందన్నారు.

పరిపాలన అనేది ఏ పార్టీకి శాశ్వతం కాదని, ఈ విషయాన్ని ప్రతి ఉద్యోగీ గుర్తెరగాలని సూచించారు. ఏదేమైనా ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తామన్నారు. సమావేశం నియోజకవర్గ వైసిపి నాయకులు సనపల నారాయణరావు, మాజీ ఎంపిపి బల్లాడ జనార్ధనరెడ్డి, హేమమాలినిరెడ్డి, జరుగుల్ల శంకరరావు, పంచాది వెంకట నరసింహమూర్తి, ఎండ రమేష్, వావిలపల్లి రామారావు, గురుగుబెల్లి రామచంద్రరావు, గురుగుబెల్లి దివాకరరావు, ముద్దాడ రామకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కృష్ణదాస్

27న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన మెగా జాబ్‌మేళాను ఈనెల 27వ తేదీన శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. నగరంలోని టిడిపి కార్యాలయంలో మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లమో, డిగ్రీ, బి.ఫార్మసీ విద్యార్హత కలిగిన 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు నిరుద్యోగ యువతీ యువకులు ఈ జాబ్‌మేళా ద్వారా ఉపాధి పొందవచ్చన్నారు. ఆరోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న ఈ మేళాలో 972 పోస్టులను భర్తీ చేసేందుకు 20 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ వివరాలను skilluniverse.apssdc.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇంటర్వ్యూ సమయంలో రిఫరెన్స్ నంబరుతో పాటు రెజ్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికేట్లు, జిరాక్స్‌లతో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9550967353, 9704960160, 7095731303 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న పురుషోత్తం నాయుడు

సిఎం దృష్టికి పెన్షనర్ల సమస్యలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ అనంతరం అతి తక్కువ పెన్షన్‌తో జీవనం సాగిస్తున్న ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ అధ్యక్షులు సుబ్బరాయన్ పోలంకి, ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల జెఎసి నాయకులు చౌదరి పురుషోత్తం నాయుడు కోరారు. అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పెన్షన్లపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఉద్యోగుల సంక్షేమం దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని, డిఎ బకాయిలతో పాటు పిఆర్‌సి బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరారు. అనారోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న ప్రభుత్వ పెన్షనర్ల మెడికల్ బిల్లులను తక్షణమే క్లియర్ చేయాలన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత పెండింగ్‌లో ఉన్న రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఆర్థిక ప్రయోజనాలను తక్షణమే చెల్లించాలని కోరారు. గత ప్రభుత్వం మూడు శాతం తగ్గించి చెల్లిస్తోన్న క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను ఏడు శాతం, పాత నిష్పత్తి ప్రకారం తగ్గించిన మూడు శాతాన్ని కలిపి 15 శాతంగా సవరించి తక్షణమే జిఒ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1.50 కోట్లు మాత్రమే ఖర్చవుతుందని చెప్పారు. సుదీర్ఘకాలం పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా సేవలందించిన పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని పురుషోత్తం నాయుడు తెలిపారు.

మనజీర్ జిలానీకి వినతిపత్రం అందజేస్తున్న సూర్యనారాయణ తదితరులు

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- అరసవల్లి

రాష్ట్రంలో ఎండియు ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అసోసియేషన్ తరుపున రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రౌతు సూర్యనారాయణ ఆ శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్, సివిల్ సప్లై డైరెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిఒక్క ఎండియు ఆపరేటర్‌కు రూ.8,400 వేతనం నుంచి వెహికల్ ఇన్సూరెన్స్ కోసం తీసుకున్నారని, అధికారుల దృష్టికి తీసుకెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం చెల్లిస్తున్న మాదిరిగానే ఇన్సూరెన్స్ ఈ ఏడాది కూడా ప్రభుత్వం చెల్లించి ఆపరేటర్లను ఆదుకోవాలని వివరించారు. సాంకేతిక కారణాలతో రూ.9,260 వెహికల్స్‌గాను సుమారు 7,500పై చిలుకు వాహనాలకు ఇప్పటివరకు ఫిట్నెస్ చేయించుకోలేదని వాటికి సంబంధించిన పెనాల్టీగా రూ.9,200 వరకు పడుతుందని ఆ పెనాల్టీ అమౌంట్‌ని తగ్గించి ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు. వారంతా సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంపై సూర్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో జిల్లా ఎండియు ఆపరేటర్ల యూనియన్ వైస్ ప్రెసిడెంట్ హేమంత్, జాయింట్ సెక్రటరీ వాసు తదితరులున్నారు.

మజ్జిగ అందజేస్తున్న గ్రామస్తులు

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి- కవిటి

ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు మండలంలోని వరకలో బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యువ నాయకుడు శ్రీకాంత్ పురియా మాట్లాడుతూ ఎన్నో సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటున్న గ్రామ యువత ప్రజల దాహార్తి తీర్చడం అభినందనీయమన్నారు. ఈ చలివేంద్రంలో రాబోయే మూడు నెలల పాటు ప్రయాణికులకు చల్లటి మంచినీరుతో పాటు మజ్జిగ కూడా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి మామిడి హరికృష్ణ, డిజిటల్ అసిస్టెంట్ పొల్లాయి అశోక్, బడగల రాజేంద్రన్, జగదీష్ బిసాయి, పి.మోహన్, ఎస్.శ్రీను పాల్గొన్నారు.

అవార్డును అందుకుంటున్న కుమార్‌నాయక్

కుమార్ నాయక్‌కు అవార్డు

పలాస: తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా నాటక రంగంలో విశేష సేవలు అందించిన, నిష్ణాతులైన, కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు ప్రదానం చేసింది. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం పలాసకు చెందిన డాక్టర్ కుమార్‌నాయక్‌కు అవార్డు, రూ.పది వేలు నగదు, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. సాంస్కృతిక, సినిమా ఆటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, నాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ హిమంసు శుక్ల, ఎపి నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, అవార్డుల ఎంపిక కమిటీ చైర్మన్ బొర్ర సాయిమాధవ్‌లు అవార్డులను అందజేశారు. నటుడిగా, దర్శకుడుగా, సందర్భోచిత రచయితగా, వ్యాఖ్యాతగా, న్యాయ నిర్ణేతగా, నాటక రంగానికి సేవలు అందిస్తున్నందుకు అవార్డును అందజేశారు.

మిర్తిబట్టి పరిశీలన

శ్రీకాకుళం: నగరంలో వ్యర్థ జలాలు తరలించేందుకు వీలుగా ప్రధాన కాలువైన మిర్తిబట్టిలో పూడికతీత పనులు చేపట్టాలని స్థానికులు గత కొన్ని రోజులుగా నగరపాలక సంస్థ కమిషనర్‌ను కోరుతున్నారు. ఈ కాల్వ పూడిక వల్ల మురుగునీరు పెద్దఎత్తున చేరి కాలనీల్లో దోమలు వృద్ధి చెందుతున్నాయని, పూడికతీత పనులు చేపట్టాలని ప్రజల నుంచి వచ్చిన వినతులపై కమిషనర్ డివివి ప్రసాదరావు స్పందించారు. బుధవారం బలగ నుంచి పాత శ్రీకాకుళం వరకు ఉన్న కాలువను పరిశీలించారు. ఈకాలువలో ఆక్రమణతో పాటు పేరుకు పోయిన మొక్కలు, గుర్రపుడెక్కను తొలగించేందుకు క్షేత్ర పరిశీలన చేపట్టారు.

ఉపాధి కూలీలకు అందని వేతనాలు

- పస్తుల్లో కూలీలు
- పట్టించుకోని అధికారులు

వలసల నివారణ కోసం ఆయా గ్రామాల్లోనే పని కల్పిస్తూ తద్వారా వారికి జీవనోపాధి కల్పించేందుకు ఎంతో ఉన్నత ఆశయంతో అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నేడు నిర్వీర్యం అవుతుంది. పనులు చేసినప్పటికీ నెల తరబడి వేతనాలు అందకపోవడంతో ప్రస్తుతం కూలీలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి దాపురిస్తుంది.

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని గ్రామీణ ఉపాధిహామీ పథకం కూలీలకు వేతనాలు సక్రమంగా అందకపోవడంతో నేడు పస్తులు ఉండాల్సిన పరిస్థితి దాపురించిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బూర్జ మండలంలో వ్యవసాయం అంతంత మాత్రమే ఉండడంతో అన్ని గ్రామాల్లోనూ రైతు కుటుంబాలు ఉపాధిహామీ పథకంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నామని కూలీలు వాపోతున్నారు. ఎండనక, వాననక నెలల తరబడి కిలోమీటర్ల దూరం కొద్ది నడిచి ఉపాధి పనులను చేసినప్పటికీ సకాలంలో వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నాళ్లుగా గ్రామాల్లో పనులు కల్పించకపోవడంతో పస్తులు ఉన్నామని ఇటీవలే ఎట్టకేలకు మళ్లీ పనులు ప్రారంభించి పనులు కల్పించడంతో ఎంతో సంతోష పడ్డామని, అయితే పనులు చేసి నాలుగు నెలలు దాటిపోతున్నప్పటికీ ఇంతవరకు చేసిన పనులకు వేతనాలు చెల్లించలేదని కూలీలు వాపోతున్నారు. మండలంలో 11,121 మందికి జాబ్ కార్డులుండగా 300 గ్రూపుల్లో 10, 173 మంది రెగ్యులర్‌గా పని చేస్తున్నారు.

మూడు కోట్లపైనే బకాయిలు

తుడ్డలిలో ఉపాధి పనులు చేపడుతున్న కూలీలు

మండలంలోని అన్ని గ్రామాల్లో గత నాలుగు నెలలుగా కూలీలకు వేతనాలు అందడం లేదని, ఇంతవరకు తమకు సుమారు మూడు కోట్లపైనే వేతనాలు ఇవ్వాల్సి ఉందని మండలంలోని కూలీలు వాపోతున్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు

కూలీలకు గత నాలుగు నెలలుగా ఉపాధిహామీ పథకం వేతనాలు అందక పోయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని కూలీలు ఆరోపిస్తున్నారు. పనులు చేసినా ఫలితం లేదని, అప్పులు చేసి జీవం సాగిస్తున్నామని, అయితే అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నప్పటికీ చర్యలు శూన్యమని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి గత నాలుగు నెలలుగా బకాయిలు ఉన్న వేతనాలను సకాలంలో చెల్లించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఎనిమిది వారాలుగా వేతనాలు లేవు

ఎనిమిది వారాలుగా ఉపాధిహామీ పథకం పనులు చేశాం. అయితే ఇంతవరకు వేతనాలు అందలేదు. తీవ్ర అవస్థలు పడుతున్నాం. అధికారులు స్పందించి తమకు కూలి డబ్బులు అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

నవరత్న శిరీష, తుడ్డలి

అవస్థలు పడుతున్నాం

వ్యవసాయం అంతంత మాత్రంగా ఉండడంతో ఉపాధి పనులకు వెళ్తున్నాం. ఉపాధి పనులు చేసినప్పటికీ వేతనాలు అందక పోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నాం. పాలకులు, అధికారులు స్పందించి వేతనాలు అందించేందుకు చర్యలు చేపట్టాలి.

లాస కమలమ్మ, తుడ్డలి

గ్రామీణ రహదారులకు మహర్దశ

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గంలోని గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టనుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి తమ్మినేని శారద అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి తారురోడ్డు సౌకర్యం కల్పించడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. పలు శాఖలపై నిర్వహించిన సమీక్షలో గ్రామాల్లో చేపడుతున్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది బాధ్యతారహితమైన విధి నిర్వహణపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ అభివృద్ధి పథకం ద్వారా గ్రామాల్లో చేపడుతున్న సిసి రహదారులు, కాలువల నిర్మాణ పనులపై సచివాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. గ్రామీణ రక్షిత తాగునీటిపై సమీక్ష జరుగుతున్న సమయంలో ఎమ్మెల్యే రవికుమార్ కలుగజేసుకొని గత వైసిపి పాలనలో ఎటువంటి నిర్మాణ పనులు చేపట్టకుండానే గుత్తేదారులకు ఇష్టారాజ్యంగా నిధులు చెల్లించారని, ప్రస్తుతం ఆ కాంట్రాక్టర్ పనులు చేపట్టకుండా కాలయాపన చేస్తున్న విషయాన్ని సభ్యులందరూ ఏక నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, సర్పంచ్ నూకరాజు, ఎంపిటిసి ప్రతినిధి బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ, ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, మండల పరిపాలన అధికారి ఎస్.వాసుదేవరావు, ఎఒ మెట్ట మోహనరావు, ఎపిఒ సుర వరపు లక్ష్మీనరసమ్మ, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

నిరసన తెలుపుతున్న కూలీలు

'ఉపాధి' బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి- కొత్తూరు

రెండు వారాలుగా ఉపాధి కూలీలకు కూలి చెల్లించకపోవడంతో ఆర్థికంగా అవస్థలు పడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని కాశీపురం ఉపాధి పనిప్రదేశంలో కూలీలతో కలిసి బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనవరి 15 నుంచి ఇప్పటి వరకు కూలీలకు కూలి చెల్లించలేదన్నారు. కూలీలపై కూటమి ప్రభుత్వానికి చిన్నచూపు తగదన్నారు. తక్షణమే స్పందించి బకాయి పడిన కూలీని తక్షణమే చెల్లించాలని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కమిషనర్ పర్యటన

పలాస: పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘ పారిశుధ్య సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలని మున్సిపల్ కమిషనర్ రామారావు సూచించారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లోని కెటి రోడ్డు, పాత జాతీయ రహదారి, అన్న క్యాంటీన్ రోడ్డు, ఉదయపురం, గొడగుల వీధి తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను బుధవారం పరిశీలించారు. అలాగే భవన నిర్మాణాలు, లేఅవుట్లపై వచ్చిన ఫిర్యాదులను వాటిని స్వయంగా పరిశీలించారు. జంట పట్టణాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు తీసు కుంటున్న చర్యల్లో భాగంగా జలజీవన్ మిషన్ (ఉద్దానం ప్రాజెక్టు) నీటిని అందజేస్తామన్నారు.

ప్రజల సహకారంతో సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నియోజకవర్గం పరిధిలో ప్రజలకు వ్యక్తిగత సమస్యలతో పాటు గ్రామాల వారీగా సామాజిక అవసరాలను తీర్చుకునేందుకు ప్రజల నుంచి పూర్తి సహకారం అందించాలని, ప్రజలు, అధికారులు సమన్వయంతో పని చేయడం వల్ల పరిష్కారం దొరుకుతుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సుమారు వందకుపైగా వినతులను ఆయన స్వీకరించారు. ప్రధానంగా కళాశాలలు ప్రారంభానికి ముందే వసతిగృహాల్లో సీట్ల కోసం పలువురు వినతులు అందజేశారు. జిల్లా కేంద్రంలో బిసి కులాలకు చెందిన బాలికలకు చదువుకునేందుకు అనేక అవకాశాలు ఉన్నాయని, కాని జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చే బాలికలకు వసతి కరువవుతోందని పలువురు వివరించారు. ప్రధానంగా బాలికల కోసం రెండు వసతి గృహాలే ఉన్నాయని, వాటిలో కేవలం 300 మందికి మాత్రమే వసతి లభిస్తోందని, ఆరు నుంచి పిజి వరకు చదువుకునే వారంతా కాలేజీల్లో చేరినా వసతి లేక అవస్థలు పడుతున్నారని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు వివరించారు. నగరంలో అదనంగా బిసి వసతిగృహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఉన్న వసతిగృహాల్లో సీట్లు పెంచాలని బందరువాని పేటకు చెందిన మత్స్యకారులు వివరించారు. అంగన్ వాడీ కార్యకర్తలు, సహాయకులకు ఎదురవుతున్న అనేక సమస్యలను పలువురు ఆయనకు వివరించారు. అంగన్వాడీల వేతనాలు పెంచాలని కోరారు. ఇతర సమస్యలతో కూడిన వినతులను ఆయన స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖలకు పంపించి సమస్యల పరిష్కారానికి తోడ్పాటు అందిస్తానని తెలిపారు.

పోలాకి : వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ఆమదాలవలస: ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని ఎమ్మెల్యే రవికుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద ఎమ్మెల్యే రవికుమార్ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాదర్బార్ కార్యక్రమంలోనే కాకుండా నియోజవర్గంలో ఎటువంటి సమస్యలున్నా అర్జీల రూపంలో టిడిపి కార్యాలయంలో ఎప్పటికప్పుడు అర్జీలు అందించ వచ్చన్నారు. కార్యక్రమంలో సిఐ పి.సత్యనారాయణ, టిడిపి నాయకులు కె.వి.సత్యనారాయణ, మొదలవలస రమేష్, నందివాడ గోవిందరావు, కిల్లి సిద్దార్థ, శివ్వాల సూర్యనారాయణ, నాగళ్ళ మురళీధర్, సంపద రావు మురళీధర్, బి.వి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోలాకి : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోనిం కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌తో ధరణి

ధరణికి అవార్డు

బూర్జ: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఒవిపేట ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలకు చెందిన కర్ని ధరణి ఎంపిసి విభాగంతో 1000 మార్కులకు 984 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ఆదర్శ పాఠశాలల విభాగంలో షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైంది. ఈ అవార్డును విజయవాడలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ధరణి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతులమీదుగా అందుకున్నారు. ధరణి అవార్డు అందుకోవడంతో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావుతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులు ధరణికి శుభాకాంక్షలు తెలిపారు.

టెక్కలి ఇఒగా వెంకటరావు

టెక్కలి రూరల్ : టెక్కలి మేజర్ పంచాయతీ ఇఒగా జి.వెంకటరావు బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన కె.వి.వి. జగన్నాథరావు దీర్ఘకాలికంగా సెలవు పెట్టారు. అనకాపల్లి జిల్లా హరిపాలెం నుంచి ఇన్‌ఛార్జిగా ఇఒగా ఇక్కడికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీపై అవగాహన చేసుకొని పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీటి సరఫరా దృష్టిసారిస్తానన్నారు. ఈయనకు సిబ్బంది పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ శశి పాల్గొన్నారు.

19న జాబ్‌మేళా

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 19న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలల్లోని జెకెసి ఆధ్వర్యాన నిర్వహించనున్న ఈ జాబ్‌మేళాలో పలు ప్రయివేట్ సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. ఫాక్స్‌కాన్, బ్లూస్టార్, టాటాటొయో, రేడియేటర్స్, అపోలో ఫార్మసీ, ముత్తూట్ ఫైనాన్స్, నవత ట్రాన్స్‌పోర్టు, డెక్కన్ కెమికల్, సోలార్, ప్యానల్స్ వంటి కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ జాబ్‌మేళాకు జెకెసి కో-ఆర్డినేటర్ బి.ఝాన్సీరాణి పర్యవేక్షకులుగా ఉంటారని, ఆసక్తి గల అభ్యర్థులు హాజరుకావాలని సూచించారు.

విద్యార్థులకు సువర్ణావకాశం

శ్రీకాకుళం రూరల్: ఇంటర్ బైపిసి 2024లో పూర్తి చేసిన విద్యార్థులకు బిఎస్‌సి పారా మెడికల్, నర్సింగ్, బిపిటి, ఎంఎల్‌టి కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నామని బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 19 వరకు అవకాశం ఉందన్నారు. కోర్సు పూర్తయ్యాక, ఉద్యోగం కల్పించి, ఫీజును జీతం నుంచి మినహాయిస్తామన్నారు. ఈ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు పదో తరగతి, ఇంటర్, టిసి, స్టడీ, కుల ధ్రువ పత్రాలతో ఈ నెల 19న సాయంత్రం 3గంటలలోగా రాగోలు జెమ్స్ ప్రాంగణ ంలోని తమ కళాశాల నందు సంప్రదించాలని సూచిం చారు. పూర్తి వివరాలకు 9121999654, 7680945357, 7995013422 నంబర్లను సంప్ర దించాలన్నారు.

అక్రమ పట్టాలపై చర్యలు తీసుకోవాలి

టెక్కలి: టెక్కలి పట్టణంలోని ఎన్‌టిఆర్ కాలనీ, మండపా కాలనీ ప్రాంతాల్లోని ఆక్రమ పట్టా నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని నీటి సంఘం మాజీ అధ్యక్షులు సత్తారు వెంకటరమణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక శ్యాంసుందరాపురం వైఎస్‌ఆర్ జగనన్న కాలనీ నిర్మాణంలో ఆక్రమాలు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం-ఈదుపురం వెళ్లే రోడ్డులో బుధవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. కవిటి మండలం కె.కపాసు కుద్దికి చెందిన రెయ్య రవి కుమార్ (25) వ్యక్తిగత పనుల నిమిత్తం ఇచ్ఛాపురం బైక్‌పై వచ్చారు. పనులు ముగించుకుని స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఇచ్ఛాపురం-ఈదుపురం గ్రామాల మధ్యలో బైక్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొన్నాడు. కింద పడడంతో తలకు బలమైన గాయం కావడంతో ప్రమాదస్థలంలోనే మృత్యువాత పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఇచ్ఛాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టౌన్ ఎస్ఐ ముకుందరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రవికుమార్ మృతదేహం (ఇన్‌సెట్‌లో రవికుమార్ (ఫైల్)

పుట్టెడు శోకం..

కవిటి: కన్న కొడుకు కడదాక తోడుంటాడని, అవసాన దశలో ఆదుకుంటాడనుకున్న ఆ తల్లిదండ్రుల ఆశలు అడియాసలయ్యాయి. ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో మండలంలోని కె.కపాసుకుద్దికు చెందిన గోకుల మాధవరావు, వేణు దంపతులు పుట్టెడు శోకంలో మునిగిపోయారు. నాన్నా లేరా.. అంటూ తమ బిడ్డ శవం మీదపడి ఏడుస్తుంటే అక్కడున్న వారికి ఓదార్చేందుకు మాటలురాలేదు. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని కె.పాసుకుద్దికు గోకుల రవికుమార్ డిప్లొమా చేసి వలస కూలీగా దుబాయ్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించు కుంటున్నాడు. ఆ విధంగానే చెల్లిపెళ్లి కూడా ఘనంగా చేశాడు. ఇటీవలే దుబాయ్ నుంచి ఇంటికి వచ్చి కుటుంబంతో గడుపుతున్నాడు. బుధవారం ఉదయం ఇచ్ఛాపురం వెళ్లి పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా హైవే సమీపంలోని స్కైడ్రాప్ ఇటుక బట్టీ వద్ద ఉన్న మలుపులో బండి అదుపుతప్పి స్తంభాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రవి మృతి చెందడంతో ఆ కుటుంబం దిక్కులేనిదైంది. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వృద్ధాశ్రమ దాత కన్నుమూత

శ్రీకాకుళం: సివి నాగజ్యోతి వెల్ఫేర్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు, వృద్ధాశ్రమం నిర్మాత సి.వెంకట నర్సింహమూర్తి (82) మంగళవారం రాత్రి గుండె పోటుతో కన్నుమూశారు.

నర్సింహమూర్తి (ఫైల్)

క్రైమ్ కార్నర్

నగరంలోని పాత శ్రీకాకుళంలో నివాసముంటున్న ఆయన విద్యుత్ శాఖలో ఇంజినీరుగా ఉన్నత స్థాయి అధికారిగా పనిచేశారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం నిర్మాణంతో పాటు నిర్వహణలో ఆయన ఆర్థిక భాగస్వామ్యం ఉంది. తన కుమార్తె నాగజ్యోతి అకాల మరణం తర్వాత ఆయన పూర్తిస్థాయిలో తన యావదాస్తిని సేవా కార్యక్రమాలకు దాన మిచ్చారు. అందులో భాగంగానే వృద్ధాశ్రమానికి ఆయన కుమార్తె పేరు సివి నాగజ్యోతి ఆనంద నిలయంగా నామ కరణం చేశారు. ఆయనకు అత్యంత సన్నిహితుడైన రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు నేతృత్వాన వివిధ సేవా కార్యక్రమాలకు సహ కరించారు. సివి నాగజ్యోతి చారిటబుల్ ట్రస్టు బాధ్యతలను సైతం ఆయనకే అప్పగించి ప్రజలకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఆయన నేత్రాలను రెడ్‌క్రాస్ ఐబ్యాంకుకు దానమిచ్చారు.

సరుబుజ్జిలి : పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

పశువుల పట్టివేత

కోటబొమ్మాళి: మండలంలోని నారాయణవలస గ్రామ సమీపం నుంచి లారీలో 13 ఆవులను అక్ర మంగా తరలిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఐ వి.సత్యన్నారాయణ తన సిబ్బందిలో కలిసి బుధవారం మాటువేసి వాటిని పట్టుకున్నారు. పట్టుకున్న వాటిలో 12 మగ దూడలు, ఒక ఆవు ఉందని, వీటిని విజయ నగరం జిల్లా కొత్తవలస గోశాలకు తరలించామని తెలిపారు. ఆవులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సరుబుజ్జిలి: మండల కేంద్రం సరుబుజ్జిలి సమీపంలో అక్రమంగా గోవులను తరలిస్తున్న రెండు వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ బి.హైమావతి తెలిపారు. బుధవారం కొత్తూరు మండలంలోని బలద సంత నుంచి విజయనగరం జిల్లా అలమండకు అక్రమంగా గోవులను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు అలికాం, బత్తిలి ప్రధాన రహదారిపై తనిఖీలు నిర్వహించగా అక్రమంగా తరలిస్తున్న గోవుల వాహనాలను గుర్తించి కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. రెండు వాహనాల్లో ఉన్న తొమ్మిది గోవులను విజయనగరం జిల్లా గుర్ల మండలం గుజ్జంగవలసలోని గోశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ బడిలో చేర్పించాలి

నరసన్నపేట : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పించి బంగారు భవిష్యత్‌కు బాటలు వేద్దామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర అన్నారు. బుధవారం పట్టణంలోని గేటులోని మున్సిపల్ హైస్కూల్‌లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రభుత్వ బడులను రక్షిద్దాం పేరిట కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, అందులో భాగంగా ఈనెల 24, 25 తేదీల్లో శ్రీకాకుళంలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయులందరికీ శిక్షణా సమావేశ నిర్వహణలో భాగంగా ఆముదాలవలస లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. పాలకుల విధానాల ఫలితంగా ప్రభుత్వ బడికి ముప్పు వచ్చిందని, ప్రభుత్వ బడిలో చేరే పిల్లల సంఖ్య క్రమేపీ తగ్గుతుందన్నారు. ప్రభుత్వ విద్యా రంగం నెమ్మదిగా కుదేలవుతుందని, ఈ చర్య వలన పేదలు, బలహీనవర్గాలకు చదువు దూరం కానుందన్నారు. తల్లిదండ్రులు బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి బి. రవికుమార్, జిల్లా కార్యదర్శి టి.వి.టి భాస్కరావు, కింతలి చంద్రావు, చింతాడ వెంకట సత్యనారాయణ మూర్తి, పంచాది రవికుమార్, పెంకి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయాలని దంత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు గొండు నారాయణరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడిఈడు గల బాల బాలికలను ప్రభుత్వ బడిలో చేర్పించాలన్నారు. మీ పిల్లలను మన పాఠశాలలో చేర్పించి చక్కని విద్యకు మమ్మల్నే బాధ్యులు చేయాలని గ్రామంలో తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాల గురించి వివరించారు. అనంతరం ఒకటో తరగతిలో విద్యార్థులను చేర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

నరసన్నపేట: ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి, జిల్లా గౌరవాధ్యక్షులు కోరాడ వైకుంఠరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మండలశాఖ అధ్యక్షులు టి.సుధీర్ అధ్యక్షతన బుధవారం ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పిద్దాం-ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేద్దాం' అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమానికి పోరాటాలే కాదు... సామాజిక బాధ్యతగా ప్రభుత్వ బడిని కాపాడుకొనేందుకు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దమయంతి, రాజు, కె.ఆదినారాయణ, సుధీర్‌కుమార్, ఉమాభాస్కర్, రాజేష్, మూల రమణ, కె.రాజారావు, నక్క అప్పయ్య పాల్గొన్నారు.

కవిటి: ప్రభుత్వ బడులు బలోపేతం చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మురళీప్రకాష్ పిలుపునిచ్చారు. కవిటి ఎంపిపి పాఠశాలలో సోంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం మండలాల యూటిఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో రోజురోజుకు విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడం, పాఠశాలలు మూసివేతకు గురవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గ్రామాల్లో ఉండే బడిఈడు బాలబాలికలందరినీ ప్రభుత్వ బడుల్లో చేర్పించి పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. తద్వారా పేద ప్రజలకు విద్య అందుబాటులో ఉండే విధంగా కృషిచేయాలన్నారు. అనంతరం యుటిఎఫ్ ముద్రించిన ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కవిటి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్, సీతంనాయుడు, సోంపేట మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కూర్మారావు, దొరబాబు పాల్గొన్నారు.

కవిటి : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

రణస్థలం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంఇఒ-2 బి.లావణ్య పిలుపునిచ్చారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని నెలివాడ, మాదిగపేట, కోష్ట గ్రామాల్లో బుధవారం ఎన్‌రోల్‌మెంట్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచడం, బడి మధ్యలో మానేసిన విద్యార్థులను తిరిగి చేర్పించడం, విద్యార్థులకు మంచి విద్యా సౌకర్యాలు అందించడం, ప్రభుత్వ పథకాలు, ప్రోత్సాహకాలను వివరించడం, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి బడిలో చేర్చే విధంగా ప్రోత్సహించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాలను నిరోధించడం, బాలికలు ఉన్నత స్థాయికి చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు వెంకటగిరి, బి.తేజేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రణస్థలం : విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఇఒ

సిబ్బందితో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు మరింత పటిష్టం

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి- మెళియాపుట్టి, పాతపట్నం

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు మరింత పటిష్టం చేయాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ సందర్భంగా మెళియాపుట్టి మండలంలోని వసుంధర చెక్‌పోస్ట్‌ను బుధవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఒడిశా రాష్ట్రం నుంచి వచ్చిన వాహనాలను తనిఖీ చేశారు. అక్కడి సిబ్బంది పనితీరుని పరిశీలించారు. చెక్‌పోస్ట్ పనితీరుని మరింతగా మెరుగుపరచడానికి మానిటరింగ్ ఆఫీసర్ కోట కృష్ణారావు తగు సూచనలు ఇచ్చారు. అనంతరం పాతపట్నంలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అక్కడి సిబ్బంది పనితీరుని పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. నవోదయం 2.0 కార్యక్రమాలు, గ్రామసభలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. ఈ స్టేషన్ పరిధిలోని బొన్ని, కోణంగి, పూతికగూడ, చాపరాయిగూడ గ్రామాల్లో నాటుసారా, అమ్మకాలను నిరోధించాలన్నారు. వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పనకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్ది నవోదయం 2.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఆయనతో సిబ్బంది ఉన్నారు.

ల్యాప్‌ట్యాప్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

శ్రీకాకుళం : విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్‌లో జిల్లా పార్టీ కార్యాలయంలో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను బుధవారం ఎమ్మెల్యే అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదవి ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని సూచించారు. అన్నింటిలోనూ విద్య ఎంతో గొప్పదని, విద్యను నిర్లక్ష్యం చేస్తే జీవితం అంధకారమవుతుందని సూచించారు. విద్యార్థి దశలోనే ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని దానిని సాధించే దిశగా కృషి చేయాలన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. కూటమి హయాంలో రాష్ట్రం విద్యాహబ్‌గా అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులు బాగా చదివి తమ తల్లిదండ్రులకు, తమ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో శ్రీచైతన్య కళాశాల యాజమాన్యం ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం మేలు

పాతపట్నం: ప్రకృతి వ్యవసాయ ఆరోగ్యానికి మేలని ప్రకృతి వ్యసాయ జిల్లా డిపిఎం పూజారి సత్యనారాయణ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డు వద్ద రైతులు వారి సొంత పొలాల్లో పండించేందుకు కావాల్సిన విత్తనాల కిట్లను బుధవారం తయారు చేశారు. కార్యక్రమంలో ఎపిసిఆన్‌ఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల వినియోగంపై అప్రమత్తం

ప్రజాశక్తి- రణస్థలం

ప్రస్తుతం ప్రతి ఇంట్లో ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్లను తప్పక వాడుతుంటారు. ఇది ఎంత ఉపయోగకరమో.. అజాగ్రత్తగా వ్యవహరిస్తే అంతే ప్రమాదమని, మహిళలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక అగ్ని మాపక అధికారి పైల అశోక్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా బుధవారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలో లంక శ్యామలరావు అపార్ట్మెంట్ వద్ద చుట్టూ పక్కల అపార్ట్మెంట్ వారితో కలిసి గృహముల యందు ఎల్‌పిజి, ఎలక్ట్రికల్, దీపం కారణాల వలన జరిగే అగ్నిప్రమాదలకు ముందుగా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ప్రమాదం జరిగిన తరువాత ఎటువంటి నివారణ చర్యలు పాటించాలో ప్రజలకు డెమో చేసి అవగాహన కల్పించారు. ఆనంతరం పోస్టర్‌ను పంపిణి చేశారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

రణస్థలం : అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కోటబొమ్మాళి: వంట గ్యాస్ ప్రమాదాలపై మహిళలు మెలుకవులు తెలుసుకోవాలని స్థానిక అగ్నిమాపక ఆధికారి పి.ఆర్.రెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం కోటబొమ్మాళి పంచాయతీ చిన్నపొందరవీధిలో మహిళలకు అగ్నిమాపక సిబ్బంది వంట గ్యాస్‌కు మంటలు వ్యాపిస్తే ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి, తదితర అంశాలపై మహిళలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధారణంగా మండే వస్తువులు దూరంగా వేయాలన్నారు. విద్యుత్, గ్యాస్ తదితర వస్తువులు ఐఎస్ఐ మార్కు ఉన్న వస్తువులు మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. ముఖ్యంగా ఇంట్లో చిన్న పిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు, టపాకాయలు ఇతర మండే పదార్థాలు అందుబాటులో ఉంచవద్దదన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది కె.రామారావు, బి.బాలకృష్ణ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు సమయస్ఫూర్తిగా వ్యవహరించి ప్రమాదాలని నివారించుకోవాలని అగ్నిమాపకశాఖ అధికారి బి.సూర్యారావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా స్థానిక ఎన్‌టిఆర్ నగర్ కాలనీలో అగ్నిప్రమాద నివారణపై డెమోతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది దుర్గారావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్వచ్ఛావతి అపార్ట్‌మెంట్ గృహిణికులకు గ్యాస్ ప్రమాదంలో ఎలా జాగ్రత్తలు తీసుకోవాలన్నదాపై అగ్నిమాపక అధికారి కె.ప్రశాంత్‌కుమార్, సూర్యారావులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది నీలాచం, కామరాజు, ఎన్.డి.ప్రసాద్, జి.వి.రమణ, డి.ప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గోవిందరావు

నిర్వాసితులకు అండగా ఉంటాం

మెళియాపుట్టి: ఆఫ్‌షోర్, మహేంద్రతనయా నిర్వాసిత కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని మహేంద్ర తనయా, ఆఫ్‌షోర్ నిర్వాసిత గ్రామాలైన అచ్చినాపురం, సవరచీపురుపల్లి, దాసుపురం గ్రామాల్లో బుధవారం పర్యటించారు. గ్రామస్తుల మౌలిక సౌకర్యాలు, తాగునీటి సమస్య తదితర సమస్యలపై గ్రామస్తులు విన్నవించారు. సమస్యలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నిర్వాసిత కుటుంబానికి ప్యాకేజీ అందే విధంగా చర్యలు చేపడతామని హామీనిచ్చారు. తహశీల్దార్ బడే పాపారావు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్‌పండా, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్‌గౌడ, మాజీ ఎంపిపిలు ఎస్.మోహనరావు, బి.లక్ష్మీనారాయణ, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, వెంకటరావు, కదంబల పైడిరాజు, బొచ్చు ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

సరుబుజ్జిలి : మండలంలోని రొట్టవలస జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బుధవారం ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఇటీవల విడుదలైన ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో పలువురు విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడంతో హెచ్‌ఎం కె.రామకృష్ణారావు చేతులమీదుగా విద్యార్థులకు ప్రోత్సాహకాలను బహుకరించారు. అధ్యాపకులు ఎం.వి.రమణమూర్తి, సి.హెచ్ రాజశేఖర్, వి. రామకృష్ణ పాల్గొన్నారు.

ఇడి వేధింపులపై కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి- శ్రీకాకుళం

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలను ఓర్వలేక ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేసోందని, అందులో భాగంగా నేషనల్ హెరాల్డ్‌పై నమోదు చేసిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు అన్నారు. బుధవారం నగరంలోని ఆదాయపు పన్ను శాఖ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఇడి, ఇసి, ఇన్‌కమ్ టాక్స్ వంటి సంస్థలను పావులుగా వాడుకొని తప్పుడు కేసులు బనాయించి ప్రతిపక్షాలను భయపెట్టాలని చేస్తున్న ప్రయత్నాలు విరమించుకోవాలన్నారు. రాహుల్ గాంధీ ఎదుగుదలను చూడలేక ఇడిని ఉసిగొల్పి తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఇలాంటి ప్రతీకార చర్యలకు కాంగ్రెస్

ధర్నా నిర్వహిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

పార్టీ భయపడేది లేదని హెచ్చరించారు. ఇడి స్వయం ప్రతిపత్తితో స్వేచ్ఛగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు కెవిఎల్ఎస్ ఈశ్వరి, డిసిసి ప్రధాన కార్యదర్శి సాయి దుల్లాఖాన్, ఎచ్చెర్ల నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఆబోతుల వెంకట నాయుడు, బి.సంజీవరావు, జిల్లా బిసిసెల్ అధ్యక్షులు అంబటి దాలినాయుడు, చంద్రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న హెచ్‌ఎం రామకృష్ణారావు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని రొట్టవలస జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బుధవారం ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఇటీవల విడుదలైన ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో పలువురు విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడంతో హెచ్‌ఎం కె.రామకృష్ణారావు చేతులమీదుగా విద్యార్థులకు ప్రోత్సాహకాలను బహుకరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.వి.రమణమూర్తి, సి.హెచ్ రాజశేఖర్, వి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న కరుణాకరరావు

గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు

ప్రజాశక్తి- పాతపట్నం

పెంపకందారులు గొర్రెలకు చిటిక వ్యాధి నివారణ టీకాలు కచ్చితంగా వేయించుకోవాలని ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు అన్నారు. మండలంలో కొరసవాడలో చేపడుతున్న చిటిక వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాదకరమైన చిటిక వ్యాధిని నివారించుకోవడానికి గొర్రెల్లో ప్రతి సంవత్సరమూ ఈ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు. మండలంలో 10,500 టీకాల లక్ష్యం కాగా, ఇప్పటివరకు 1500 గొర్రెలకు టీకాలు వేసినట్లు చెప్పారు. చిటిక వ్యాధి సోకిన గొర్రె వెంటనే చనిపోతుందని, దానివల్ల గొర్రెల పెంపకందారులకు ఆర్థిక నష్టం ఎక్కువగా అవుతుందని అన్నారు. కార్యక్రమంలో కొరసవాడ పశు వైద్యాధికారి డాక్టర్ పి.అనిల్, సిబ్బంది చినబాబు, గొర్రెల పెంపకందారులు బతకల లక్ష్మీనారాయణ, పల్ల నరహరి, గురయ్య శేఖర్ పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు ప్రారంభం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

కోరిన ప్రతిఒక్కరికీ కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ పనులు కలిపిస్తుందని తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కొనారి కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కొండవూరు పంచాయతీలో బుధవారం ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. తారు రోడ్డు నుంచి పెద్దపర వరకు రూ.4.24 లక్షలతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గం తెలుగు యువత ప్రధాన కార్యదర్శి లండ ధనరాజ్, ఎంపిటిసి సూళ్ల చిట్టిబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ కోనారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న సిఐ అవతారం

బాలికలకు కరాటే అవసరం

రణస్థలం రూరల్: బాలికలు సెల్ఫ్ డిఫెన్స్ కోసం కరాటే చాలా అవసరమని జె.ఆర్.పురం సిఐ ఎం.అవతారం అన్నారు. ఈ నెల 10, 11, 12 తేదీల్లో అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ పెన్కాట్ సెలాట్ రాష్ట్రస్థాయి పోటీలు చత్తీస్‌ఘడ్ రాష్ట్రం బిలాస్ పూర్ జిల్లా బి.ఆర్.యాదవ్ ఇండోర్ స్టేడియంలో జరిగాయి. ఈ పోటీలకు రణస్థలం మండలం శ్రీ పరశురామ యుద్ధ కళాక్షేత్రానికి చెందిన శిక్షకుడు లింగాల ఈశ్వరరావు ఆధ్వర్యంలో దున్న సుచరిత పాల్గొని బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా బుధవారం సిఐ అభినందించి బాల బాలికలకు ఇలాంటి యుద్ధ విద్యలు చాలా అవసరమన్నారు.

పాఠశాల తనిఖీ

పాతపట్నం : మండలంలోని చాకిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ గోవిందరావు బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలకు సొంత భవనం లేకపోవడంతో శిథిలావస్థలో ఉన్న భవనంలో నడుపుతున్నారని గ్రామస్తులు వివరించారు. శాశ్వత భవనం కోసం స్థలం ఉందని, అవసరమైతే ఎక్కువ స్థలం కావాలంటే ఇస్తామని స్థానికులు హామీనిచ్చారు. 25 మంది విద్యార్థులు చదువుతున్నారని, అదనంగా ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఈయనతో పాటు సిఆర్‌ఎంటి బాబూరావు, ఉపాధ్యాయులు ఉన్నారు. అనంతరం విద్యార్థులతో పాఠ్య పుస్తకాలను చదివించారు.

మాట్లాడుతున్న ఎంఇఒ ధనుంజయ మజ్జి

ప్రాథమిక విద్య పునాది

ప్రజాశక్తి- కవిటి

ప్రాథమిక విద్య ప్రతి విద్యార్థికీ పునాదిలాంటిదని, దాన్ని నిర్లక్ష్యం చేయకూడదని మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి అన్నారు. మండలంలోని జగతి పంచాయతీ బొన్నపుట్టుగ పాఠశాల రజతోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న గ్రామంలో కూడా విద్యార్థుల సంఖ్య తగ్గిపోకుండా 25 ఏళ్లుగా పాఠశాల కొనసాగించడం అభినందనీయమని అన్నారు. వైస్ ఎంపిపి పూడి నేతాజీ మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదివి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.వి.రమణమూర్తి, విశ్రాంత ఎంఇఒ పూడి బాలయ్య, గ్రామస్తులు పి.సీతారామమూర్తి, డి.నారాయణమూర్తి, పిరియా జగ్గయ్య, పూడి ప్రవీణ్, శమల్ల వ్యాదవ్యాస్, డి.మల్లి, విద్యా కమిటీ చైర్మన్ శ్యాం, గ్రామ పెద్దలు తిమ్మయ్య, లోకనాథం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గోవిందరావు

ఘనంగా కందుకూరి జయంతి

ప్రజాశక్తి- లావేరు

బుడుమూరు ఉన్నత పాఠశాలలో కందుకూరి వీరేశలింగం జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ మహనీయునికి ఘనంగా నివాళ్లర్పించారు. 1848 ఏప్రిల్ 16న రాజమండ్రిలో జన్మించిన వీరేశలింగం గొప్ప సంఘ సంస్కర్త, తెలుగు జాతి గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి, సాహితీ వ్యాసంగంలోను కృషి చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి అని జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పూజారి గోవిందరావు తెలిపారు. తెలుగు జాతికి నవయుగ వైతాళికుడు. వీరేశలింగం స్త్రీవిద్యకై ఉద్యమించి, ప్రచారం చెయ్యడమే కాక, బాలికల కొరకు పాఠశాలను ప్రారంభించాడన్నారు. మగపిల్లలతో ఆడపిల్లలు కలిసి చదువుకునే సహ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టారని, అంటరాని కులాలకు చెందిన పిల్లలను కూడా చేర్చుకుని మిగతా పిల్లలతో కలిపి కూర్చోబెట్టేవారన్నారు.

కళలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

కళలను ప్రోత్సహించాలని శ్రీరామ సేవా సంఘం అధ్యక్షులు మోసా వరప్రసాద్ అన్నారు. ప్రపంచ కళలు దినోత్సవం సందర్భంగా మంగళవారం రాత్రి అక్కుపల్లిలో కళాకారుల దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాకారులు తమ కళలతో సమాజాన్ని చైతన్యపరిచి అభివృద్ధికి పాటు పడతారని తెలిపారు. గ్రామ వీధుల్లో, చిన్న స్టేజీలపై నృత్య ప్రదర్శనలతో తన జీవితాన్ని ప్రారంభించి పలాస నియోజకవర్గంలో ఆర్‌డిఎక్స్ పేరుతో డాన్స్ స్కూల్ ఏర్పాటు చేశారన్నారు. తద్వారా స్కూల్ విద్యార్థులకు తమ కళను అందిస్తున్న రాక్ స్టార్

రాజాను సన్మానిస్తున్న కళాకారులు

కుంది రాజాను అభినందించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు పొంది సుమారు 600 అవార్డులను తమ సొంతం చేసుకున్నారని అన్నారు. ఓ మాట అనుకుందాం అనే చలన చిత్రంలో డాన్స్ కొరియాగ్రాఫర్‌గా సేవలందించి జిల్లా డాన్స్ యూనియన్ సెక్రటరీగా ప్రజలకు సేవలందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అర్జాల ఈశ్వరరావు, కాస చలపతి, సింగుపల్లి జగన్నాథం పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘ పరిధి 31వ వార్డులో వైసిపి ప్రభుత్వ హయాంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములు తిరిగి ప్రభుత్వానికి అప్పగించాలని స్థానిక టిడిపి నాయకులు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ కళ్యాణచక్రవర్తిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు మాట్లాడుతూ సూదికొండ ఏరియా పురుషోత్తపురం సర్వే నంబరు 346లో సచివాలయం వెనుక భాగం సుమారు 80 సెంట్లు ప్రభుత్వ భూమి అవార్డు కౌన్సిలరు ప్రతినిధి శిష్టు గోపి ఆధ్వర్యాన ఆక్రమణకు గురైందని గుర్తించామని అన్నారు. దీనిని ప్రభుత్వపరం చేయాలని కోరారు. అదేవిధంగా మున్సిపాలిటీ వ్యాప్తంగా చెరువులు, కాలువలు, శ్మశానాలు, వరద బట్టీలు కూడా ఆక్రమణలకు గురయ్యాయని, వీటిపై దర్యాప్తు చేయాలని విన్నవించారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, కొండే నరసింహ, శ్రీకాంత్, మలిపెద్ద నరేంద్ర కుమార్ (చిన్ని) పాల్గొన్నారు.

బోరు ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో లక్కుపురం గ్రామానికి నాగావళి నది నుంచి సుమారు రెండున్నర కిలోమీటర్ల దూరం పైపులైన్, బోరు వేసేందుకు ఎంపిపి కె.దీప బుధవారం శంకుస్థాపన చేశారు. గ్రామానికి రెండు బోర్లు ఉన్నప్పటికీ తాగునీరు బాగులేదని చెప్పి ఎంపిపి తెలియజేయడంతో ఆమె జలజీవన్ నిధుల నుంచి పైపులైన్, బోరుకు రూ.15 లక్షలు మంజూరు చేశామన్నారు. మరికొద్ది రోజుల్లో గ్రామానికి నాగావళి నీరు అందిస్తామన్నారు. ఈమెతో పాటు స్థానిక సర్పంచ్ బి.కృష్ణ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ చైతన్యకుమార్, మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు, మాజీ ఎంపిటిసి రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యాకుసుమాలకు అభినందనలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని వజ్రపుకొత్తూరులో ఉన్న బాలికలు జూనియర్ కళాశాలలో చదివిన ఇంటర్ విద్యార్థులు ఇటీవల విడుదలైన ఫలితాల్లో సత్తాచాటారు. అదే కళాశాలలో ఇంటర్ చదివిన నువ్వలరేవుకు చెందిన బెహరా దీపిక, ఎం.అశ్విని, బి.లక్ష్మిలు అత్యధిక మార్కులు సాధించారు. దీంతో కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ తారకేశ్వర పండా, తోటి ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వీట్ తినిపిస్తూ అభినందించారు. కాగా మత్స్యకార బాలికలు ఇంటర్ పరీక్షలో ప్రతిభ కనబర్చి

అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తారకేశ్వర పండా

శ్రీకాకుళం అంబేద్కర్ అడిటోరియంలో మంత్రుల చేతుల మీదగా సత్కారం అందుకోవడం అభినందనీయమఅన్నారు. బాలికలు రానున్న రోజుల్లో ఉన్నతమైన చదువులు చదవాలని అకాంక్షించారు.

మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా

ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- పోలాకి

మండలానికి అభివృద్ధి పథంలో నడిపిద్దామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ముద్దాడ దమయంతి అధ్యక్షతన బుధవారం మండల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మండలంలోని సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య, ఎంపిపి ప్రతినిధి భైరాగినాయుడు, డిఇఒ తిరుమల చైతన్య, తహశీల్దార్ ఎం.సురేష్‌కుమార్, ఎంపిడిఒ జి.రవికుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ఊయల ప్రారంభం

నరసన్నపేట : పిల్లలు వద్దనుకునేవారు సామాజిక ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఊయలలో వేయాలని ఎమ్మెల్యే సూచించారు. నరసన్నపేట ఏరియా ఆస్పత్రిలో ఊయల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లలను చెతకుప్పల్లో, పెంటకుప్పల్లో వేయొద్దని కోరారు. ఇటువంటి పిల్లలను చట్ట ప్రకారం దత్తత ఇస్తామని స్పష్టం చేశారు. అనంతరం బాలింతలకు పళ్ళు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

బూర్జ : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని లక్కుపురం అంగన్వాడి కేంద్రంలో సిడిపిఒ ఆధ్వర్యంలో బూర్జ ఐసిడిఎస్ పర్యవేక్షకులు పి.రత్నం లక్కుపురం అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణీ, బాలింతలు, చిన్నారులకు పోషకహారంపై సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోషకాహారంపైన అవగాహన కలిగి ఉండాలని, ఆకుకూరలు, గుడ్లు, బెల్లపు చెక్కీలు తదితరమైనవి తీసుకోవాలన్నారు. ఆమెతో పాటు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కాశీ విశ్వేశ్వరరావు, కార్యకర్త వినయకుమారి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని స్థానిక అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడపై పిఒ నాగరాణి బుధవారం అవగాహన కల్పించారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.సుజాత, ఎస్.నీలవేణి, జె.లక్ష్మి, పి.పల్లవి, పి.పుష్పలత, జి.కృష్ణవేణి పాల్గొన్నారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.

ల్యాప్‌టాప్ అందజేస్తున్న అరుణకుమారి

టివి, ల్యాప్‌టాప్ అందజేత

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాలలో సాంఘీకశాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న పి.అరుణకుమారి బుధవారం స్మార్ట్ టివి, రెండు ల్యాప్‌ట్యాప్‌లను ప్రధానోపాధ్యాయులు డి.గోవిందరావుకు అందజేశారు. వాటిని పేద పిల్లల ఉన్నతికి వాడాలన్నారు. వీటి సహాయంతో గ్రామీణ పిల్లలు సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు.

రెల్లిగడ్డ మరమ్మతులకు నిధుల మంజూరు

ఆమదాలవలస: పొందూరు మండలంలోని రెల్లిగడ్డ తాత్కాలిక మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు టిడిపి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. పొందూరు మండలంలోని తాడివలస - పైడి జోగిపేట గ్రామాల మధ్య ఉన్న రెల్లిగడ్డను తాత్కాలిక మరమ్మతులు చేయుటకు రూ.14.40 లక్షల నిధులను మంజూరు చేసినట్లు కలెక్టర్ ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇచ్చినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో రెల్లిగడ్డ పనులను వెంటనే మరమ్మతులు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ మరమ్మతుల వలన రెల్లిగడ్డ సాగునీటితో రైతులకు ప్రయోజనం చేకూరనుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎక్కువ కేసులు పరిష్కరించాలి

ప్రజాశక్తి- టెక్కలి

మే నెల 10న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ శాతం కేసులు పరిష్కారానికి పోలీసులు, న్యాయవాదులు చర్యలు తీసుకోవాలని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్.హెచ్.ఆర్.తేజచక్రవర్తి మల్లా కోరారు. కోర్టు ఆవరణలో పోలీసులతో, న్యాయవాదులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజీకి అనుకూలమైన ఎక్కువ కేసులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో పోలీసులు, న్యాయవాదులు సమన్వయంతో వ్యవహరించి లోక్ అదాలత్‌ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో టెక్కలి, నందిగాం, మెళియాపుట్టి, మండలాలకు చెందిన పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పినకాన అజయ్‌కుమార్, న్యాయవాదులు దివ్వల వివేకానంద, పేడాడ బాబూరావు, వైకుంఠరావు పాణిగ్రాహి, సాయిరాజ్, దాడి ధర్మారావు, చంద్రశేఖర్ పట్నాయక్, పైల చంద్రుడు పాల్గొన్నారు.

నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కూటమి ప్రభుత్వంతోనే గ్రానైట్ పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని ఆ పరిశ్రమల సంఘం ప్రతినిధులు, నిమ్మాడ సర్పంచ్ కింజరాపు సురేష్, దుర్గా గ్రానైట్స్ యజమాని చౌదరి, గోపి అన్నారు. మండలంలోని నిమ్మాడ కూడలిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులతో కూడిన నాయకుల ఫ్లెక్సీలకు బుధవారం పాలాభిషేకం చేశారు. కూటమి ప్రభుత్వం కోవిడ్-19 ఖర్చుల నిమిత్తం సీనరీస్ ఛార్జీలతోపాటు పెంచిన వంద శాతం కన్సడరేషన్ పన్నులు పూర్తిగా ఎత్తివేసిందన్నారు. కొత్త లీజులకు 20 నుంచి 30 ఏళ్లకు, రెన్యూవల్స్‌కు 15 నుంచి 20 ఏళ్లకు పెంచడంతో గ్రానైట్ యాజమాన్యాలకు ఊరట లభించిందని అనందం వ్యక్తం చేశారు.

ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేస్తున్న యజమానులు

అంతకు ముందు కింజరాపు ఎర్రన్నాయుడు విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో పెద్దబమ్మిడి మాజీ సర్పంచ్ శిమ్మ నారాయణరావు, గ్రానైట్ పరిశ్రమల యజమానులు పాల్గొన్నారు.